కథా నిలయం
1320
శ్రీకాకుళం

# మమకారం

భర్త బూట్లచప్పుడు, క్రమ క్రమంగా క్షీణించిపోతూ, నిశ్శబ్దమయింది. తొరతొరగా కొట్టుకొనే గుండె చప్పుడు తప్ప యింకేమీ వినిపించటం లేదు, సరోజినికి పగలే అయినప్పటికీ. పెదిమలు వొణుకుతున్నాయి, లోపలి భయాన్ని, ఎందుకో తెలీని ఉద్వేగతను ఆపుకోనేందుకు చేసే ప్రయత్నంలో ఒక్కసారి, చప్పున వీధిలోకెళ్ళి, కుటుంబరావును పిలుద్దామనుకుంది. ఆఫీసు మాని తనతో ఉండమనేందుకు. కానీ...వృథా, లేవలేదు ఓపిక లేదు. ఎవరో తనకు తెలీనివాళ్ళు, ఏవో తనకు తెలీని శక్తులు, ఆమె ఉద్దేశ్యాన్ని వొంచి, అణచి, బలాన్ని ఆపి, కదలనివ్వడల్లేదు సరోజినిని.

ఇంతక్రితం వరకూ సరోజిని లోపల అనుకొంటూనే ఉంది, ఈయన—అదే—ఈ మనిషి కుటుంబరావు, ఎప్పుడు ఆఫీసుకు పోతాడా, ఇంకా తొరగా పోడేమిటా అని. పాపం! ఏ దేవతలకో కోపమొచ్చి, కాలాన్ని ఆపి, క్షణాలను దీర్ఘం చేశారు గావును! కాదా? రోజూ పెందరాడే వచ్చే గన్నేరుపొదు నీడ యింకా గడప దగ్గిరికి రాదేం? నిజం! ఇట్లాగే అనుకున్నదా సరోజిని? ఇప్పుడు పోయినందుకు విచారిస్తోంది. తప్పనిసరిగా పోవలసిన అతని డ్యూటీమీద కోపం ఆమెకు.

ఎన్నో అనుకుంది. ఎట్లా ఎట్లా సమీపించాలి? తొలిగా ఎట్లా మాట్లాడాలి? ఒకవేళ అతను ముందుగా పలకడు. అప్పుడు? పలికితే? తను అనుకున్నట్లే మాట్లాడతాడా సీను? కాదా? మరో విధం అయితే? ఏమిటి? ఏమిచెయ్యాలి అప్పుడు తను? తెలీను. వీటికి మాటి మాటికి తనను ముసురుకొని చికాకు పరిచి, మనస్సునే ఛిద్రం చేస్తున్న వీటికి—దొరకదు సమాధానం ఆమెకు.

బహిరంగంగా ఆమె స్తబ్ధు. కానీ లోపల గట్టిగా జరుగుతూనే ఉంది అలజడి. ఒక్కోసారి నిజంగా బాధపడుతుంది, కుటుంబరావును తలచుకొని, అతనికి ద్రోహం చేస్తున్నానేమోనని. అయితే సీనుమీద కోరిక

కలగటమే తప్పయితే, ఆ కోరికే అసలు తనకు రాకుండా ఉండాలిగదా! ఇంత గాఢంగా, బిగ్గరగా సీనువేపు సాగే తన వాంఛ తప్పో, ఇంత గొప్ప ఆవేశాన్ని చంపుకొని, పాపానికి, వీటికి మృగాలవంటి మనుషులకు జడిసి వ్యక్తిత్వాన్నే, ఆత్మనే వక్రించుకొని లోపల ఏ కల్మషమూ లేనట్లు అంతా నిర్మలమూ స్వచ్ఛమూ అయినట్లు దొంగ బ్రతుకు బ్రతకటమే తప్పో నిర్ణయించుకోవటం, నిర్ణయానుసారం ఆచరించడమూ, ఎంత కష్టం!

ఆమెకు ముందుగా తెలీదు సీను విషయం. ఏ కొంచెం తెలిసినా అతన్ని యింటికి తేవొద్దని భర్తతో చెప్పగలిగేది సరోజిని. చిన్నప్పటి స్నేహితుడు; గొప్ప ఉద్యోగం. వచ్చాడు. తనిక్కడ ఉండగానే సీనును ఎట్లా హోటల్లో ఉండమంటాడు కుటుంబరావు. అందులో అతనికి భార్య మీద నమ్మకముంది. ఏ శంకరమో అయినట్లయితే స్నేహితుడేమిటి, తండ్రినే, తమ్ముణ్నే, అమ్మనే నమ్మేవాడు గాడు. భార్య శీలాన్ని వీళ్ళంతా ఆదరిస్తారనీ, లేదా యింకో కళకు దాచిపెడతారనీ భయంవలన భార్య కాపరానికి రాగానే, చేస్తున్న పనినే వొదిలి ఆ దౌర్భాగ్యురాలికి కావిలి కాచునేవాడు చుట్ట కాలుస్తూ, గుడిపక్క వేపచెట్టుక్రింద మంచం వేసుకుని. పురుష వరేణ్యా! ధీరోదాత్తా! ఎంత ప్రబల విశ్వాసమోయి నీ భార్యమీద నీకు! నాయనా! నీలోని ఏ మానసిక శారీరక, దౌర్బల్యాలు, పెరిగి నిన్నిట్లు అపనమ్మకస్తుణ్ని చేసినయో కదా! నిన్ను వొదిలి మరొకడికి నీ భార్య లొంగిపోతుందనే మహోత్తర భావం నీలో కలగటానికి నీ దౌర్బల్యమే కారణమంటే శంకరానికి యెంత కోపం వస్తుందనీ! అనుమానమున్నవాళ్ళు, ఆ అద్దాల సోడా కొట్టుదగ్గరో, సింగుగారి పళ్ళదుకాణం దగ్గరో పావుగంట కాచుంటేచాలు తెలుస్తుంది.

మానవ జీవితమే అనుమానాలతో నిండిపోయింది. అదే గొప్ప నాగరికతా లక్షణం. ఏ వ్యక్తినైనా చూడండి. అతనికో అనుమానం వుండితీరుతుంది. కనీసం నేను బ్రతికుండగా వందరూపాయల జీతగాణ్నవుతానా? పదివేలు బాంకులో వేస్తానా? యిండియాకు కమ్యూనిజం వొస్తుందా? ఆవు కోడెను ఈనుతుందా? 'పాప' మరొకసారి ఆ గట్టిపమిటు వెనక ఉన్న తాలను ప్రసాదిస్తుందా? ఏ దానిమ్మ చెట్టుపక్కనో, వడ్లబస్తాల వెనుకనో, చీకట్లోనో, పగటినో; ఇటువంటి అనుమానాలే లేక, 'వొస్తుంది'—'జరుగుతుంది' అనే గట్టి నమ్మకంతో కృషి చేసేవాళ్ళు, మూఢులూ, పిచ్చివాళ్ళు అవుతున్నారు.

కుటుంబరావు అట్లా భార్యను వొదిలి వొంటరిగా, పోతున్నప్పుడు, ఎందరు హితకాంక్షులు, శ్రేయోభిలాషులు, అతన్ని అట్లా పోవద్దని చెప్పలేదు!

గత మూడు రోజులనుండీ సరోజిని జీవన శకటం తోవతప్పింది. ఎంత ప్రయత్నించీ, సీనుబొమ్మను, తన మనోఫలకంనుండి చెరిపి వెయ్యలేకపోయింది. ఆ ప్రయత్నం లోతుగా చేస్తున్నకొద్దీ, అతను మరింత సన్నిహితంగా, గట్టిగా; దగ్గిరిగా అవుతున్నాడు తనకు. ఎట్లా తోసేసుకుంటుంది సరోజిని, తనకు తెలీకుండా, తన ప్రమేయం లేకుండానే, తన హృదయాన్ని లాలిత్యాలతో, లావణ్యాలతో, నింపించి బాధించే అతనిమీది కోరికను – పనివుండక పోయినా అతను పడుకున్న గదివేపు పోతుంది. మెల్లగా ఏ వీలులోనించో చూస్తుంది. అతను నిద్రపోతుంటే దగ్గరిగా వొంగి, అతన్ని తనలో ఇంద్రచాపపు సాంద్ర వర్ణ ధూమాలను రేపే సీనును–అట్లా చూస్తోవుంటుంది. అతనికి తెలీకుండానే మెల్లగా అతని జుట్టును, దుస్తుల్ని తాకుతుంది. ఆమె ప్రబల హృదయావేదనను అర్థం చేసుకోగల వాళ్ళెంతమంది, ఎవరో 'అనూ' వంటివారు తప్ప.

రకరకాల కలలు. తలుచుకొంటేనే సర్వాంగాలు – అవును సర్వాంగాలూ, కిర్వ్వాలు ప్రవహించే సుందర స్వప్నాలు. ఎంతహాయి !!

...చప్పున లేచింది, ఆమె ప్రయత్నం లేకుండానే ఎవరో ఆమెను తీసుకెడుతున్నారు. లేతగులాబీరంగులలోంచి, ముదురు పసుపులోకి, నీలపు మెరుగులోకి, ఎక్కడున్నామో తెలీనిలోకం. సరోజిని శరీరం అనంత భారంతో మూర్ఛనలు పోయింది. పచ్చటివళ్ళు, గట్టి గుండ్రని భుజాల వుబ్బులు నవ్వుతోంది. అట్లా నవ్వుతున్నట్లు తనకు తెలుస్తోనే వుంది సరోజినికి. ఎవరో గంధర్వుడు, ఆమె పక్కనే పడుకున్నాడు. చేతులు, వీపు అడుగుగా పోనిచ్చి, గట్టిగా తన గుండెలను అదుముకున్నాడు, గట్టివైన ఆమె రొమ్ములను, మెల్లిగా ప్రయత్నం మీద – కళ్ళు – కొద్దిగా విప్పింది. సీను, తన సీను, పెదిమకు పెదిమ, రొమ్ముకు రొమ్ము, బరువుగా ఆమె జుట్టు అతని భుజాలు కప్పింది, కామినియావాసనలతో సహా.

"సరూ !!"

"మాట్లాడకు."

మాటలే లేవు మాట్లాడటానికి. విషయాలు లేవు. అతను చప్పున ఆమె పైటలాగి...బస్. మెడ వెనక వేళ్ళవేడి. హృదయంలోంచి హృదయం

లోకి దూకే నిప్పుచినుకులు. కాలే పెదిమలతో ఆమె రవికను వెదికాడు. ఆమె రెండు తెల్లని చేతులు అతన్ని బంధించి తనమీదికి జార్చుకొంటున్నాయి.

"సరూ"

యెవరో ఆమెను గట్టిగా అద్దుకొని, కుదిపి లేపుతున్నారు. సహజమైన, మామూలైన కౌగిలి అది. మూడు సంవత్సరాల నుండీ అలవాటయిన కౌగిలి అది.

"ఏమిటి సరూ"

అన్నాడు కుటుంబరావు అప్పుడే కళ్ళుతెరచిన ఆమెమీదకు వొరిగి, బరువంతా ఆమెమీద ఆన్చి.

"ఏమిటి"

అని గొణిగింది సరోజిని. తన స్వప్నం భంగమయింది. మామూలు చారలపరుపు, కుటుంబరావూ మిగిలారు.

"అట్లా వున్నావేం ? కలవరించావేం"

"ఏం లేదు"

అన్నది అతన్ని భుజాలు పట్టుకొని కొద్దిగా పైకియెత్తి.

"లేదా ? నిజం ! కలవరించావు అస్పష్టంగా. చప్పున నన్ను దగ్గరగా తీసుకొని రొమ్మును అందించావు, అందమైన నీ గొప్పు..."

సరోజిని కళ్ళల్లో నీళ్లు, తెల్లని చెక్కిళ్ళమీదుగా దిండులో ఇంకి పోతున్నాయి.

"ఏమిటి సరూ"

అన్నాడు కుటుంబరావు. సరోజిని వులిక్కిపడి, చప్పునలేచి కూచుని, అతన్ని వొళ్లోకి తీసుకొని, అతనిమీదికి వొంగి, ఏడుస్తోంది.

"ఏమిటి ?"

అంటోనే వున్నాడు కుటుంబరావు.

"వొద్దు నన్ను తాకవొద్దు. పాపం చేశాను...ఛీ...పాపం... ద్రోహం..."

ఇవితప్ప ఆమె పెదిమలు ఇంకోటి పలకవు. ఎంత అడిగినా చెప్పదు. ఆమె వొళ్ళు వెచ్చగా కాలిపోతున్నది. జుట్టు రేగి ముఖంనిండా భుజాల, రొమ్ములనిండా కప్పింది. రవికలేని ఆమె అందాలు దీపవు కాంతికే మెరుగులు. ఆ రాత్రి ఇద్దరూ వేరు వేరుగా పడుకున్నారు.

ఏదో క్యాంపుగావును...ఉదయమే వెడతాడు సీను. మధ్యాన్నమో సాయంత్రమో వొస్తాడు. ఒకప్పుడు అతనూ శృంగార జీవే? ఉద్యోగం, డబ్బు, అధికారం, అంకెలు, అతనిలోని శృంగార భావాన్ని దళ్ళగించి, శిలని చేశాయి. ఆడవాళ్ళు, కావిలింతలు, ముద్దులు, యూరువులనున్ని స్పర్శలు, కాళ్ళ మెలికలు, అతని జీవితంలోనించి తొలగించబడ్డాయి–ఒక్క భార్య విషయంలో తప్ప.

ఒకరోజు...చాలా రాత్రి. గదిలో దీపం గుడ్డిగా వెలుగుతోంది. సీను గాఢంగా నిద్రపోతున్నాడు. ఏదో అలికిడి, ఏదో వెచ్చటి స్పర్శ. బరువైన సువాసనల జుట్టు అతని ముఖంమీదికి జారివుంది. చరాలున లేచాడు. సరోజిని! కాళ్ళలో బలం లేక తూలుతోంది. ఒరిగి పడబోతూంది. చప్పున రెండు చేతులతోనూ ఆమె నడుమును పట్టుకొని నిలబెట్టాడు. మెల్లిగా మూలిగి ఆమె శరీరం అతనిమీదికి వాలింది. చేతులు వీపువెనక కలుసుకొని బిగుసుకొంటున్నాయి. స్పృహలేని, నున్నని తెల్లని ఆమె చేతులు, వేలమంది యువకులు, కావాలని కలలుకనే ఆమె లావణ్య శరీరం, అర్థరాత్రి లభించిన ఆ యువకుడు ఎంత అదృష్టవంతుడో గదా!

"ఏమండీ!"

సరోజినిని కుదిపి అడిగాడు సీను. ఆమె కళ్ళు తెరిచింది. ఎదురుగా సీను. అతనిలో కుటుంబరావు విసురుగా వొక్క తోపుతోసి, గబుక్కున పక్కకు తిరిగింది. రెండడుగులు నడిచి, కూలబడి, ముఖాన్ని చేతులతో కప్పుకొని ఏడుస్తున్నది.

సీనుకేమీ తోచక, స్నేహితుణ్ని పిలిచాడు. సరోజినిని చూసేసరికి, కుటుంబరావుకు ఆశ్చర్యం వేసింది. తను కూచుని, భుజాలక్రింద చేతులు వేసి లేవదీశాడు.

"ఏమిటి సరూ ?"

ఏం చెబుతుంది ? యెట్లా చెప్పగలుగుతుంది ? తనను కాల్చి, మండించే ఆ వాంఛను, అందులో భర్తతో, మెల్లిగా తలెత్తి సీనును చూసింది. వెంటనే కుటుంబరావును చూసింది. చప్పున భర్తవేపు వొంగి, అతని గుండెకు తల ఆనించి ఏడుస్తుంది.

"జ్వరం ! అందుకేనా యీడవటం! తగ్గిపోతుంది. లోపలకు వెడదాం రా !"

ఆమెను అట్లా కావలించుకునే లోపలకు తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు. మాట్లాడదు, కదలదు, నిద్రపోతుంది. మధ్య మధ్య ఉలిక్కిపడుతుంది. నిద్రలోనే చేతులు చాపి యెవరినో దగ్గిరికి తీసుకుంటుంది. కళ్లు తెరిచిందా ? యెటో చూస్తుంది. ఈ లోకానికి, పరిస్థితులకు సంబంధంలేని చూపులు, చుట్టూ యెవరున్నారో యేం చేస్తున్నారో కూడా అవసరంలేని చూపులు. తనలో తనే గొణుగుతుంది. పెదిమలు కదిలిస్తుంది. ఏం తెలుస్తుంది యెవరికైనా ఆమె సంగతి; తను స్వయంగా చెబితే తప్ప...

ఆ రోజు సాయంత్రం కుటుంబరావు పెందలాడే వచ్చాడు. తలుపులు దగ్గిరిగా వేసి ఉన్నాయి. ఏమయింది సరోజిని ఆ వేళప్పుడు ? గబగబా ఇల్లు వెతికాడు. సీను గదిలో అతని బెడ్‌మీద పడుకుని ఉంది. తెల్లని పక్క నిండా, నల్లని గట్టి జుట్టు అల్లుకొని; ఆ సాయంత్రం చీకటిలోనే, మెరుస్తున్న ముఖం.

"సరోజినీ !"

పలకలేదు ఆమె. కుటుంబరావు తనూ మంచంమీద కూచుని ఆమెను లేవదీశాడు. చొక్కాతో చెమట తుడిచాడు. చీర తిరిగి కట్టి, ఆమెను భుజం మీద వేసుకుని వరండాలోకి తెచ్చాడు. ఎంత శ్రమపడ్డ తర్వాతనో గానీ, ఆమెకు తెలివి రాలేదు. మెల్లిగా కళ్లు తెరిచి కుటుంబరావును చూసింది తడి కళ్ళతో. వెంటనే అతని గుండెమీదకు వాలి, మెడను కావలించుకొని వీపు వెనక వెక్కి పడుతున్నది.

"ఎందుకు సరూ ? ఏమిటి అసలు విషయం ?"

అన్నాడు కుటుంబరావు ఆమె ముఖాన్ని ముందుకు లాగి, చెక్కిళ్ళను పెదిమలతో తాకుతూ. ఉప్పగా కన్నీళ్లు తగిలాయి అతనికి.

"ఏం లేదు."

దృఢత్వాన్ని తెచ్చుకోవాలని ప్రయత్నం గొంతులో.

"అబద్ధం—కదూ ?"

మెల్లగా గడ్డాన్ని ఊయిస్తూ ఆమె కళ్ళల్లోకి చూసి అన్నాడు.

ఎట్లా కాదనగలుగుతుంది ? నిజమే మరి ! లాభం లేదు. తను కుటుంబ రావుతో అబద్ధం చెప్పలేదు; తనను నమ్మి, తనే సర్వస్వమూ అనుకునే కుటుంబరావుతో.

"అవును."

తల వంచుకుంది సరోజిని.

"ఎందుకో చెప్పు ఈ బాధ ? ఏం కావాలి ? ఎవరేమన్నారు నిన్ను ?"

"ఎవరూ లేరు" అని లేచిపోయింది.

కుటుంబరావు ఆమె వెనకనే వెళ్ళి, అడ్డం నిలుచుని, ఆమె భుజాలు పట్టుకుని దగ్గిరగా తీసుకున్నాడు. అతని చేతులు అప్రయత్నంగా ఆమె నడుము దగ్గరికి పాకాయి. ముఖం, సరోజిని ముఖానికి ఆనించి "నిజం చెప్పు సరోజినీ ! ఎందుకు ఈ అస్వస్థత నీకు! ఏంకావాలి?" అంటున్నాడు.

"ఏం వద్దు."

పోబోయింది.

అతని కళ్లు కరిగి కారుస్తున్నాయి.

"ఏం ద్రోహం చేశాను సరూ నీకు ? ఇంత నిశ్శబ్దంగా హింసిస్తున్నావు నన్ను..."

ఇంకా ఏదో అనబోయాడుగాని గొంతు రాదు కుటుంబరావుకు.

సరోజిని తిరిగి వచ్చి అతన్ని ఆనుకుని నిలుచుంది, సూటిగా ముఖంలోకి చూస్తూ.

"నిజం చెప్పు. ఎందుకు ?"

అంటున్నాడు బ్రతిమిలాడు కొంటున్నట్లు. అతనిలోకి చూస్తోంది. చెప్పబోయి ఆగుతుంది. పెదిమ కొరుక్కుంటుంది.

"నేను..." అని ఆగిపోయింది.

"ఆఁ...ఏమిటి ?"

అతని కంఠంలో బుజ్జగింపు, ఏమయినా వప్పుకోగల శీవి.

"వద్దు, వద్దు, నన్ను విడవండి, నేను పాపిని..." అని ఓగ్గరగా ఏడిచింది.

అతను మరీ క్రుంగిపోయినాడు. ఎందుకు భయపడుతోంది సరోజిని ? తనేం చేస్తాడు చెబితే ! తననే నమ్మదా ? అనే ఆలోచనలు కుటుంబరావుకు.

"నిజం. నీ కోసం...నే నేమయినా అవుతాను సరూ! నా వద్ద దాచకు. నా నెత్తురుతో నిన్నభిషేకం చేస్తాను....ఏం కావాలి ?"

అబద్ధంగాడు. ఆ మాటలు నిజమే ! సరోజిని కోసం అతనేమయినా అవుతాడు. మూడు సంవత్సరాల క్రిందట అయినాడు కూడానూ.

ఒకనాడు అతను రోడ్లంట వస్తున్నాడు. గాలి ఆడక ఉక్కిరి బిక్కిరయినాడు. యెవరో లాగుతున్నట్లు నడక సాగదు. ఆగి చూశాడు. చుట్టూ, పడిపోబోతున్న పెంకుటింటి వసారాలోనుంచి యెవరో తనను లాగుతున్నారు కంటికి కనిపించని బంధనాలతో. కాసేపటికిగానీ ఆ కాంతి పుంజంనుండి ఓ అమ్మాయి రూపం అతను చూడలేక పోయినాడు. ఆమె చూపులే, నడకలే, పెదిమ వంకరే ప్రత్యేకం. ఈ ముంజముఖాల లలనా మణులనుండి, ఏ కపటమూ, మోసమూ, కల్మషమూ యెరగని ఆమె హృదయం పారిశుద్ధత, పెదిమలపై వెలిగే నవ్వులో కనిపిస్తుంది. పురుషుణ్ణి కుదిపి వెర్రు లెత్తించి, కుంగగొట్టే రొమ్ముల కాంతులు. వెన్నెలలు పేరుకొని ఘనీభవించిన సుందర కాంతులు ఆమె చెక్కిళ్ళని. కలలలోకి వెళ్ళాడు.

"కారు కారు కారు"

ఎవరో పెద్దగా కేక వేశారు. చట్టున ముందుకు తప్పుకున్నాడు. తలెత్తి చూసేసరికి ఆమె లేని జీబురు వసారా ఎదురుగా. రోజూ ప్రదక్షిణాలు, తపస్సులు, కలలు, ఆమె తాకిన కాయితం కోసం, నిలుచున్న చోటు కోసం తాపత్రయం. ఒక్కసారి నిజంగా అనుకునేవాడు. "నేను—ఈ జన్మకాక ఇంకోటయినట్లయితే ఎంత బావుండును ? ఆమె చిన్ని గట్టి రొమ్ములను ఎప్పుడూ తాకుతూవుండే, నీలం జాకెట్టు, ఆ బంగారు లోయలో వెచ్చగా

నిద్రపోయే, సన్న చైన, పిరుదులను, కాళ్ళను తాకే చీరను కాగూడదా? ఏ జన్మలో, ఏ గొప్ప సుకృత జన్మమో అట్లా అవి ఉండే వరం పొందాయి."

కానీ కొద్ది ప్రయత్నంమీద ఆమె సాంగత్యం లభించింది కొంత కాలానికి. ఆ మొదటి అనుభవం ఎప్పటికీ మరుపు రానిది. నాగమ్మ ధర్మమా అంటూ, ఆమె ఇంటో కలుసుకున్నారు వాళ్ళు మొదటిసారి. అంతే! ఇంక గాఢమైన అనురాగం. వొకరి నొకరు చీల్చి, కాల్చి, భస్మం చేసుకొనే ఉద్రేకం. ఇది కామమా? ప్రేమా? మోహమా? అనే ప్రశ్నలే లేవు. పుష్కలమైన బలం, మంచి అవకాశం, వొంటినిండా విద్యుత్తు, ఇంకేం కావాలి? ఏ ప్రేమ, మోహం, కామంగానీ, స్త్రీ పురుషులు వొకరి కొకరు దగ్గరయి, ఒకరి కావిలిలో మరొకరు లీనమయి, లీలయినంత సన్నిహితం, ఒకేచోటు కాకపోతే ఆ పదాలకే అర్థం ఉండదు. వొట్టి చెత్త. ఏ పేరుతో, ఏ సందర్భంలో ఎంత పవిత్రంగా, నిర్మలాగా పలికితేనేం, చివరకు స్త్రీ పురుష కలయికకు చేరుకోక తప్పదు. మరో మార్గమే లేదు...

ఊరంతా తెలిసింది. శ్రేయోభిలాషులు, గోడలకు ప్రకటనలు అంటించి మతులు తీర్చుకున్నారు. ఇంక ఆ ఊరు దుర్భరమయి సరోజినిని రమ్మన్నాడు కుటుంబరావు తనతో మరో ఊరుకు.

"నిజమా?"

అన్నది సరోజిని. అతనన్న మాటల్లో ఎక్కడ ఆమెకు అపనమ్మకం కలిగిందో. అట్లా కలగటానికి పురాతన కాలంనుంచి పురుషులు స్త్రీలకు చేస్తున్న అన్యాయాలు, భగ్న వాగ్దానాలు, మోసాలు, అబద్ధాలు, జాతిలోనే పేరుకొనిపోయి ప్రతి రక్తకణంలోనూ దాగి ఆమెకు అట్లా ప్రశ్నించేట్లు చేశాయి గావును. నిజమే నన్నాడు ఎన్నో ప్రమాణాలు చేశాడు.

"మరి అమ్మ, తమ్ముళ్ళు, పొలం, తోటివాళ్ళు..."

అంటున్నది సరోజిని. ఈ కుళ్లు పదాలు, శుభ్రమైన ఆమె పెదవులు ఉచ్చరించటం, భరించలేక, చప్పున తన నోటితో మూశాడు కుటుంబరావు.

"ఒద్దు. ఎందుకవి వీళ్ళ నాకు? నా ఆనందానికి అడ్డుగా... తెలుసు. ఇది కృతఘ్నత కాదు. నన్ను కృతఘ్నుడుగా అయ్యేట్లు తయారుచేస్తున్నాయి. పరిస్థితులు. నాదేం తప్పా ఇందులో? అవును, వాళ్ళకు మాత్రమేం తెలుసు

నా కెట్లా ఆనంద మొస్తుందో ? నా జీవితాన్ని నిర్దేశించవలసింది నేను వాళ్లు గాదు. నిజమే ! హృదయాలను పరాకాష్టింప చేయగల వ్యక్తులు దొరకకనే ఈ జనం, డబ్బును, పొలాలను, ఉద్యోగాలను, గౌరవాలను అవలంబిస్తున్నారు. వాళ్ళు నిష్కల్మషమనుకునే "ప్రేమ" ఈ హృదయపు పై పొరలను దాటిపోలేదు. అట్లా పోయిననాడు, నిజంగా ఇవన్నీ తృణప్రాయాలవుతాయి!"

అతని వాదన ఆమె తలలో కెక్కుతోంది. నాలుగోనాకు సరోజిని కనిపించలేదు కుటుంబరావు బంధువులు అన్నిచోట్లా వెదికారు. పత్రికల్లో వేయించారు.

ప్రతివాళ్ళూ, గొప్పవని వాదించేవీ, శ్రమపడేవీ, అతనికి లక్ష్యంలేదు. తిరస్కరించి, త్యజించి వచ్చాడు సరోజిని కోసం, ఆమె చిన్న పెదిమల కాంతిహాసం కోసం, ఆలింగనంలోని లాలిమకోసం, మెడమీది తెల్లచారల నీడలకోసం. యెట్లా భరిస్తాడు ఆ సరోజిని దుఃఖాన్ని కుటుంబరావు ?

మొదట చెప్పకపోయినా యెంతో బ్రతిమలాడిన తర్వాత సరోజిని తలొంచుకుని "పోనివ్వండి—బాధపడతారు మీరు" అన్నది.

"ఇదివరకువాటి కంటే ?"

అన్నాడు అతను. ఇదివరకు తాను పడ్డవి బాధలనిపిస్తూనే ఉన్నాయి గావును అతనికి, ఏ హృదయపు లోతు పొరల అడుగుననో !

"నిజం చాలా పరుసైనది."

"నిజమే చెప్పు."

అతని ముఖం చూసిన తర్వాత సరోజిని ఆబద్ధమాడలేక పోయింది.

"శ్రీను..."

అని ఆగిపోయింది. అతని ముఖాన్ని చూస్తో.

"నా చిన్ననాటి ప్రాణస్నేహితుడు. ఏం అతను ?"

"బావుంటాడు."

మళ్ళీ ఆమెలో సంకోచం.

"అవును. చాలామంచి అంతే అంటారు అతన్ని చూసి."

“ఆతను...సీను...పోనివ్వండి...పాపిష్టిదాన్ని...నా గొంతు పిసకండి...చంపండి...నా హృదయం మిమ్మల్ని మోసం చేస్తోంది. నే నేం చెయ్యను ? ఎంత ప్రయత్నించినా మరల్చుకోలేక పోయినాను. దుర్మార్గుడు”

అంటూ చప్పున దూరంగా పోయి, గోడకు ముఖమానించి ఖేదపడు తున్నది.

కుటుంబరావు క్షణకాలం నిశ్చేష్టుడయి తేరుకొన్నాడు. సరోజిని వేపు ఆకలిగా చూశాడు. అతని తలలో ఉక్కిరి బిక్కిరిగా ఆలోచనల ప్రవాహం, రకరకాల మృగాలు, జంతువులు, విజృంభించటానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ నిరర్థకం. సరోజిని సౌందర్యచ్ఛాయలు, ఆమె మీది గాఢానురాగం మృగ ప్రకోపాలను అణచి వేస్తున్నాయి.

అత్యంత సహజమైన విషయం. ఆశ్చర్యానికి, దూషణకు తావులేని విషయం. ఒక మనిషిమీద మరొక మనిషికి వాంఛ కలగటం చాలా మామూలు. ఆ వాంఛను తీర్చుకోవటానికి ప్రయత్నించటమూ విడ్డూరం కాదు. తనేం చేశాడు ? సరోజిని కోసం ఎన్ని బైటి విలువల్ని, హోదాలను వదులుకోలేదు. సరోజిని కంటే ఉన్నతులు చాలామంది తనకు తటస్థపడినా, కాదని తోసివేశాడు గదా ! అట్లాగే గదా సరోజిని కూడా ! పవిత్రంగా ఆరోగ్యంగా ఉండవలసిన మనస్సు మరొక వ్యక్తిరూపాలతో నిండిపోయిన తర్వాత, ఇంక శరీరమా కాపాడుకోటం ? జీవమేలేని శరీరం, ఎముకలు, మాంసమూ మాత్రమే కలిగిన శరీరం, శిలలాంటి శరీరం, ప్రాణమున్న బొమ్మ లాంటి శరీరం.

అతనిలో ఒక దృఢనిశ్చయం. మోసమూ, ఎత్తులూ, వంచనాలేని నిశ్చయం. మెల్లిగా లేచి సరోజిని దగ్గిర కెళ్ళాడు. ఆమె కళ్ళు యింకా నీలాలు స్రవింప చేస్తూనే ఉన్నాయి.

“ఇందుకేనా ఇంత అలజడి పడటం ?”

అని ఆమె కన్నీళ్ళు తుడిచాడు కుటుంబరావు. సరోజిని దిగ్భ్రమ చెంది అతన్ని చూస్తోంది. కుటుంబరావునుండి ఈ మాటలు వస్తాయని, ముందుగా అనుకుని ఉండదు.

"తప్పులేదు ఇది పశుత్వమూ, వికృతమూ, అపురూపమూ కాదు. హృదయమున్న ప్రతి వ్యక్తికీ అనుభవమే యిది. ఎవరన్నా దీనికి నీచార్థాలు కల్పించితే, వాళ్ళకు, నీచత్వమంటే ఏమిటో కూడా తెలీదన్నమాట."

"నేను...పాపి..."

"ఆగు, సరూ! నీకు ఆ పరిపూర్ణ స్వాతంత్ర్యం యిస్తున్నాను. కొట్టి, అణిచి, బాధించి, బెదిరించి ఎవరూ హృదయాలను అందుకోలేరు. వెళ్ళు. ఆ అవకాశం కలిగిస్తున్నాను నీకు. హృదయ రహితమైన నీ శరీరం దుర్భరం నాకు. నువ్వు ఈ లోకంలో దేనివల్ల ఏ కారణంచేత నయినా సరే బాధ పడటం నేను సహించను. నాకు ప్రత్యేక ఆనందమనేది లేదు. నీ ఆనందంలో, నీ సుఖంలో నాకు భాగముంది. ఇందుకేనా నాలుగు రోజులనుండి బాధ పడుతున్నావ్ ?"

కుటుంబరావు అతి సహజంగా, ఏ ఉద్రేకమూ లేక, ఏ తుచ్ఛత్వమూ లేక, సరోజినితో అన్నాడు. ఒక్కసారి ఆమెను కావిలించుకుని, ముఖాన్ని దగ్గిరిగా తీసుకొంటూ "ఈ నాలుగు రోజులు ఏడుపుతో నీ ముఖసౌందర్యమే నశించిపోయింది. ఏదీ చిన్న నవ్వు, కోట్ల వెన్నెలల మృదుత్వాన్ని మించే గొప్ప కాంతిహాసం..." అన్నాడు.

కళ్ళు తెరచింది. కుటుంబరావు బైటికి వెడుతున్నాడు. ఆమె కొంచెం సేపు అట్లాగే కొయ్యబారి నిలుచుండి పోయింది. కుటుంబరావును ఇంత విశాలంగా ఆమె యెప్పుడూ అనుకోలేదు. ఇంత క్రితంవరకూ అతను కూడా తన యదార్థ రూపాన్ని చూపించలేదేమో ? చూపించవలసిన అవసరమే కలగలేదో ? ప్రతి మనిషిలోనూ మృగత్వము, మానవత్వము, దేవత్వమూ ఉంటాయి. సమయాన్నిబట్టి పరిస్థితులనుబట్టి సంస్కారాన్ని బట్టి అతనిలోని తత్వాలు పనిచేస్తుంటాయి.

సరోజిని కొంతసేపు బాధపడింది. ఇంత మంచి భర్తకు అన్యాయం చేస్తున్నానేమో అని. కానీ అన్యాయమా ? అని గట్టిగా ప్రశ్నించుకుంటే, కాదనిపిస్తున్నది. అన్యాయమే కావచ్చు స్థూలదృష్టికి. కానీ ఈ అన్యాయాల నన్నిటినీ అధిగమించి, నిశితంగా పరిఢవిల్లే మనస్సు అట్లా కుళ్ళుగా ఉంచు కొని, లోపల ఏమీ లేనట్లు ప్రవర్తించటం ఇంతకంటే అతన్ని మోసం చేసి నట్లు కాదా ?

సీను పెందరాడే వచ్చాడు పని ముగించుకుని. రోజూ అతను, కుటుంబరావు కలిసి స్నానం చేసేవాళ్లు. ఇవ్వాళ కూడా అతని కోసమే గావును సీను ఎదురు చూస్తున్నాడు.

"స్నానానికి రండి." అన్నది సరోజిని సీనుతో.

"వాడు, కుటుంబం రాలేదా ఇంకా ?"

"లేదు. కొంచెం పొద్దుపోయిగానీ రాడట. మిమ్మల్ని పెందరాడే భోజనం చెయ్యమన్నారు."

ఆమె కంఠంలో వొణుకు వచ్చి, అబద్ధాలు చెబుతున్నాననే తీవ్ర వేదన లోపల. కొన్ని నిమిషాలు అతనిమీద అసహ్యం కలిగించుకోటానికి ప్రయత్నిస్తుంది. కానీ కలగదు. బంగారాన్ని, ఇత్తడిగా అనుకోవాలని ఎంత ప్రయత్నించితే మాత్రం ఏం లాభం ? మామూలు మనుషులు ? ఎవరో యోగులకు, ఋషులకు అటువంటి మహాశక్తులుంటాయి గావును ; అన్ని వస్తువులనూ సమానంగా చూసే దృష్టి. కానీ అది ఆరోగ్యకర దృష్టి కాదేమోననే వాదన కూడా ఉండనే ఉంది. ఏ వస్తువును, ఆ వస్తువుగా, ఏ గుణాన్ని, ఆ గుణంగా గాక, అన్నిటినీ ఒకే కొలబద్దతో కొలవటం, కొలిచి విలువలు గట్టటమూ సాహసమే నంటారు. అయితే, మనం "గొప్ప" అనుకునే వాటిల్లో నిజంగా ఆ గొప్పదనం లేదేమో ? "ఉన్నది" అని మనల్ని మన మనస్సే భ్రమలో ముంచుతుందేమో ? మనస్సును కమాండ్ చెయ్యగల ధీరోదాత్తులు, అది వేసే వెర్రి వేషాలను, అధిగమించి, నిజమైన "అసలు" చూస్తారేమో ? అట్లా చూసినప్పుడు అన్నిటి నగ్నరూపమూ ఒకటేనంటే ఎట్లా కాదనగలం? మనస్సునే ప్రధానం చేసుకుని విలువలు మీరు కడితే, మనస్సు కలిగించే భ్రమాసందోహాన్ని దాటి విలువలు మేము ఇస్తున్నామనే వాళ్ళకు ఏముంది సమాధానం ?

స్నానం చేశాడు, భోజనం చేశాడు, అతని గదిలోకెళ్లి పడుకున్నాడు చదువుకుంటూ. ప్రతిక్షణమూ, సరోజిని అనుకుంటూనే ఉంది, అతన్ని పలకరించాలనీ, తాకాలనీ. కాని ఎవరో ఆపినట్లు, చప్పున వెనక్కు తిరిగేది. చాలాసేపు ఆలోచించింది. నిజంగా కాదు, ఆలోచించాననుకుంది సరోజిని. కానీ ఏమీ తెలీదు. దూరంగా చీకటి గంటలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు రక్తం

కమ్ముకుతూ చుక్కలు రాలుతున్నాయి ఆకాశంనుండి. చెట్లలో మిణుగురు పురుగుల కాంతి ధారలు, కీచురాయి గానం.

సీను మైమరచి నిద్రపోతున్నాడు. దూరంగా దీపపు మరణ కాంతి అతనిమీద కొద్దిగా ప్రతిఫలించి ఇంకిపోతున్నది. ముందు చిన్నగా ప్రారంభమై విశాలమైన నీడ, కాంతికి అడ్డు. అతని ముఖంమీద, దిండుమీద, పొడుగయిన సువాసనల వెంట్రుకలు. నడుస్తున్నదో, తేలి వస్తున్నదో, తెలీకుండానే వచ్చింది ఆ గదిలోకి సరోజిని. ఆమె కళ్ళలో నీరు, జుట్టు అతని ముఖానికి కప్పి, మెల్లిగా అతనిమీదికి వొరిగింది. ఊపిరికి లేచి, అణుగుతున్న వెడల్పు గుండె. అతన్ని రొమ్ముకు తీసుకు అనుకుంది. అతని పెదిమలు, తన చెక్కిళులు వెతుకుతున్నాయి.

"ఎవరూ ?"

సీను చప్పున లేచి కూచున్నాడు. అతనికింకా తెలీలేదు. ఆ చీకట్లో తనని పరిమళాల కేశాలతో ముంచింది. దీపం పెంచి చూస్తే—

"మీరా !"

అతని గొంతులో పెద్ద ఆశ్చర్య ధ్వని.

"మీకింకా జ్వరం తగ్గలేదా ? కుటుంబమున్నాడా లేదా యింకా ?"

అంటున్నాడు సీను. స్త్రీ యెప్పుడు యెందుకు యెట్లా ప్రవర్తిస్తుందో తెలుసుకోలేని అతను, జ్వరమనే అనుకుంటున్నాడు యింకా సరోజినికి.

"రండి. మిమ్మల్ని గదిలో వొదిలి వస్తాను... వెధవకు బొత్తిగా బుద్ధి లేదు. సుస్తీగావున్న మనిషిని వొదిలి పొద్దు పోయిందాకా రాకపోవటం ?"

అని ఆమెను పట్టుకుని నడిపించడానికి ప్రయత్నిస్తున్నాడు. సరోజిని అతనిమీదికి వొరిగి, బరువంతా ఆన్చింది. చేతులు అతని మెడచుట్టూ తిప్పి తనకు అద్దుకుంది. ఆమె వెచ్చని ఊపిరి అతని ముఖాన్ని కాలుస్తూంది. తెలుస్తూనే ఉంది కొంచెం కొంచెంగా ఆమె వాంఛ సీనుకు. వేళ్ళ చివర నిశితమైన వేడి, ఆమె రొమ్ములనుండి తన గుండెలోకి పొడిచే మెరుపులు— తెలుసుకుంటున్నాడు...అనుమానం, మళ్ళీ వొట్టిదేనేమో? జ్వరంలో వుండే తనకు తను తెలీక ఇట్లా చేస్తున్నదేమో ? తనే లేనిపోని భావనలన్నీ చేసుకుంటున్నాడేమో ?

ఐతే అనుమానం వెంటనే తేలిపోయింది, నిరాధార మయినదని. ఆమెను గట్టిగా తోశాడు సీను. తూలిపడబోయి నిలవదొక్కుకొంది.

"వొద్దు తిరస్కరించకు. నీకోసం...నిజం! నమ్ము నా మాట! నీ కోసమే ఈ నాలుగు రోజుల దిగులూ నాకు."

అంటున్నది సరోజని అతనివేపు జరుగుతూ. సీను ఉలిక్కిపడ్డాడు.

"ఆగు, ఒక్క అడుగు ముందుకు వెయ్యకు. మోసం చేస్తున్నావు కుటుంబరావును. వాడికి, నా కుటుంబరావుకు, ప్రాణస్నేహితునికి ద్రోహం చెయ్యలేను."

అని అరుస్తున్నాడు సీను. సరోజని తల తిరిగిపోతోంది. భూదేవి బ్రద్దలయి తనను గర్భకుహరంలోకి లాక్కుపోతున్నట్లు, గదిగోడలే పునాదుల నుండి పెళ్ళగించుకొని ప్రళయనాట్యం చేస్తున్నట్లు ఉద్వేత్తుగా చీకటి పొగలురేగి ఘోషలు పెడుతున్నట్లు అనిపించింది సరోజినికి.

"నువ్వు మంచిదానివని భ్రమించి నీ సౌందర్యానికి దాసుడయి వాడు నిన్ను చేసుకొన్నాడు. తల్లినీ, తండ్రినీ, బంధువుల్నీ, గౌరవాన్నీ, డబ్బునూ వొదులుకొని. నీవు వాడి గౌరవాన్నే నాశనం చేస్తున్నావు. ఛో, వెళ్ళు. వాడూ నేనూ,ఓ కంచానతిని పండుకొన్నాము వొకే మంచంమీద. నా కుటుంబానికి, ద్రోహం, అన్యాయం చెయ్యలేను..."

సరోజిని స్తంభితురాలయింది. చలన రహితంగా గోడకు జారబడి పోయింది. శృంగార మేః తెలీని చవటను ప్రేమించినందుకు, విచారిస్తున్నదా? లేక, తన భర్తకూ, సీనుకూగల, సన్నిహిత స్నేహానికి అందమైన స్త్రీ నిండు హృదయంతో స్వాధీన మవుతానంటే, స్నేహితపు విలువకోసం, కాలదన్నిన, అతనిధీర గుణానికి ఆశ్చర్య పోతున్నదా ఎవరికి తెలుసు?

సీను తొరతొరగా తన సామాను సర్దుకొని వెళ్ళిపోయాడు. తెల్లవారి కుటుంబరావు యింటికొచ్చాడు. కళ్ళు ఎర్రగా, మాంసపు ముక్కలకు మల్లే

వున్నాయి నిద్రలేక. జుట్టు జీబుగా రేగివుంది. కాళ్ళనిండా దుమ్ము. రాత్రంతా ఎంతబాధ పడ్డాడో అతను?

"సరోజినీ!"

అని బొంగురు గొంతుతో పిలుస్తూ కుటుంబరావు లోపలి కొచ్చాడు. వొంటిమీద స్పృహలేకుండా, సరోజిని వాకిట్లో పడి వుంది. ఆమె ముఖం నిండా జుట్టు చిక్కుపడి వుంది. కుటుంబరావు ఆమె దగ్గిరకి వెళ్ళి, తలను వొళ్ళోకి తీసుకొన్నాడు.

"సరోజినీ!"

బిగ్గిరిగా పిలిచాడు. సరోజిని పలకలేదు. కుటుంబరావు కళ్ళనుండి, రెండు అశ్రుబిందువులు ఆమె నుదురుమీద పడి యింకిపోయినాయి.